

# చదువు

నైపుణ్య

ఈనాడు

హైదరాబాద్, మంగళవారం జనవరి, 2, 2018




**ఆత్మవిశ్వాసమే విజయ సూత్రం!**

విజయానికి ఒక ప్రధానమైన సూత్రం ఆత్మవిశ్వాసం. ఆత్మవిశ్వాసం పెరగాలంటే ఒకే ఒక మంత్రం సన్నద్ధత. అందుకే సరైన సన్నద్ధత ఉంటే విజయ సాధన కష్టం కాదు.

– ఆర్థర్ యాష్, ప్రసిద్ధ అమెరికన్ టెన్నిస్ ఆటగాడు, మూడు గ్రాండ్‌స్లామ్‌ల విజేత




మా చిరునామా:
**చదువు**
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512
■ edc@eenadu.net


## నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

**లోక్‌నాయక్ హాస్పిటల్, న్యూదిల్లీ**
పోస్టు: జూనియర్ రెసిడెంట్
ఖాళీలు: 201 అర్హత: ఎంబీబీఎస్
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.
చివరితేది: 13.01.2018
వెబ్‌సైట్: http://delhi.gov.in/

**జేఎన్‌యూ, న్యూదిల్లీ**
పోస్టు: ప్రొఫెసర్/ అసోసియేట్ ప్రొఫెసర్/ అసిస్టెంట్ ప్రొఫెసర్
ఖాళీలు: 90 అర్హత: యూజీసీ నిబంధనల ప్రకారం
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ చివరితేది: 29.01.2018
వెబ్‌సైట్: https://www.jnu.ac.in/

**ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రిసెర్చ్**
పోస్టు: సైంటిఫిక్ ఆఫీసర్, మెడికల్ ఆఫీసర్ తదితర పోస్టులు
ఖాళీలు: 13 అర్హత: ఎంబీబీఎస్/ ఎంఎస్/ ఎండీ/ బీఈ/ బీటెక్.
ఎంపిక: నిబంధనల ప్రకారం
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ చివరితేది: 31.01.2018
వెబ్‌సైట్: http://www.igcar.gov.in/

### ఫెలోషిప్స్ అండ్ స్కాలర్‌షిప్స్

**కల్చరల్ టాలెంట్ సెర్చ్ స్కాలర్‌షిప్ స్కీమ్**
ఖాళీలు: 650
స్కాలర్‌షిప్: సంవత్సరానికి రూ.3,600 + ట్యూషన్ ఫీజుల కింద రూ.9,000 అర్హత: 10 - 14 ఏళ్ల విద్యార్థులు.
విభాగాలు: మ్యూజిక్, డాన్స్, డ్రామా, పెయింటింగ్, స్కల్ప్చర్, క్రాఫ్ట్స్, లిటరరీ ఆర్ట్స్
దరఖాస్తు: ఆఫ్‌లైన్ చివరితేది: 31.01.2018
వెబ్‌సైట్: http://www.ccrtindia.gov.in/

**డీఆర్‌డీవో - సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్**
జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్
ఖాళీలు: 15
ఫెలోషిప్: రూ.25,000
విభాగాలు: ఏరోడైనమిక్స్, స్ట్రక్చరల్ డిజైన్ అనాలిసిస్ తదితర విభాగాలు.
అర్హత: బీఈ/ బీటెక్/ ఎంఈ/ ఎంటెక్/ నెట్/ గేట్.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
చివరితేది: 20.01.2018
వెబ్‌సైట్: https://www.drdo.gov.in

**పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.**

# నేరుగా... నేర్పుగా!

**వివిధ దశల్లో సుదీర్ఘంగా సాగే ఉద్యోగ నియామకాలకు భిన్నంగా స్వల్ప వ్యవధిలోనే తగిన అభ్యర్థులను ఎంచుకునే విధానం- వాక్ ఇన్స్. పెద్ద సంస్థలు కూడా తమ అవసరాలకు అనుగుణంగా ఇప్పుడీ విధానం వైపు మొగ్గు చూపుతున్నాయి. ఈ తరహా నియామకాల స్వభావం గ్రహించి వాటిలో మెరుగైన ప్రతిభను ప్రదర్శించి నెగ్గటం అభ్యర్థులకు సవాలే!**



ముందస్తు అపాయింట్‌మెంట్ ఏదీ లేకుండా నేరుగా ఎంపిక ప్రక్రియకు హాజరయ్యే వెసులుబాటును ఇస్తాయి, వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు. ముందుగా ప్రకటించిన తేదీ, సమయాల్లో సంస్థ ప్రతినిధులతో అభ్యర్థుల ముఖాముఖీ జరుగుతుంది.

**ఈ తరహా ఇంటర్వ్యూలను చేపట్టడానికి చాలా కారణాలున్నాయి.**

❐ ఒక సంస్థ వ్యాపారాభివృద్ధిలో భాగంగా ప్రాజెక్టుల కోసం చేసిన ప్రయత్నం ఫలించి ప్రాజెక్టు వచ్చినపుడు తక్కువ సమయంలో దాన్ని పూర్తిచేయడానికి కావాల్సిన మానవ వనరులను సమకూర్చుకోవాల్సి వస్తుంది.

❐ కొన్ని ప్రముఖ సంస్థలకు అవసరమైన ఉద్యోగ స్థానాలకు మామూలు ఎంపిక ప్రక్రియ ద్వారా అభ్యర్థులు దొరక్కపోవచ్చు. అప్పుడు వారు అలాంటి అన్ని స్థానాలకూ ఒకేసారి వాక్‌ఇన్ నిర్వహిస్తుంటారు. దీనిద్వారా నిర్ణీత సమయం దాటిపోకముందే ఆ స్థానాలను నింపడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది.

❐ నియామకాలకు జరిగే వ్యయం కూడా కంపెనీలకు తగ్గుతుంది.

### వివిధ విధానాలు

❐ ఒక సంస్థ అభ్యర్థులను తమ ప్రాంగణానికే నియామక ప్రక్రియ నిమిత్తం ఆహ్వానించవచ్చు.

❐ ఒకటికన్నా ఎక్కువ సంస్థలు ఒక ఉమ్మడి వేదికను ఎంపిక చేసుకుని, జాబ్ ఫేర్ ద్వారా అభ్యర్థులను వాక్‌ఇన్‌కు ఆహ్వానిస్తాయి.

❐ సంస్థ/ సంస్థలు నిర్వహించే పోటీల్లో పాల్గొన్నవారిలో ఉత్తమ అభ్యర్థులకూ వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఇలాంటి ఇవెంట్స్‌ల్లో ఉత్తమ ప్రతిభావంతులు ఎంపికవుతారని సంస్థల అభిప్రాయం.

మామూలు ఇంటర్వ్యూల కంటే వాక్‌ఇన్ ఇంటర్వ్యూల్లో పోటీ ఎక్కువ. ఉద్యోగ అవసరం ఉండి, అర్హత ఉన్న ఏ అభ్యర్థి అయినా పాల్గొనే వీలుండటమే ఇందుకు కారణం. పైగా ఇది ఒక కళాశాలకో, ప్రాంతానికో పరిమితం కాదు. దీంతో ఈ వాక్‌ఇన్ ఇంటర్వ్యూలకు ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు హాజరైనప్పుడు చాలాసార్లు సంస్థలు మొదటి స్థాయిలోనే షార్ట్‌లిస్ట్ చేసి, చివరి రౌండ్‌కు తరువాత పిలుస్తారు.




**వెంకట్ కాంచనపల్లి**
సీఈఓ, సన్‌టెక్ కార్ప్


### తక్కువ సమయంలో మెప్పించాలి

ప్రాంగణ నియామకాలైనా, సాధారణ రిక్రూట్‌మెంట్ అయినా ఎంపిక కోసం నిర్దేశించిన ఒక సమయం ఉంటుంది. కానీ వాక్‌ఇన్‌ల్లో పోటీ ఎక్కువ కాబట్టి, లభించేది తక్కువ సమయమే. అందుకని వీటికి ప్రత్యేకంగా సన్నద్ధమవ్వాలి.

❐ రెజ్యూమే చాలా ముఖ్యం. మొదటగా సంస్థ చూసేది దీన్నే. దాన్ని పక్కాగా తయారు చేసుకోవాలి. సంస్థ అవసరాలకు అనుగుణమైన సమాచారాన్ని రెజ్యూమేలో పొందుపరచుకోవాలి. అది నిర్దిష్టంగా, సూటిగా ఉంటే చాలా మంచిది. సంస్థ అడుగుతున్న అర్హతలు, నైపుణ్యాలు, ఇంటర్న్‌షిప్‌లు, అనుభవం మొదలైనవాటిని వరుసలో పొందుపరచాలి. మొత్తంగా రెజ్యూమేని చూడగానే ప్రొఫైల్ కళ్లముందు కదిలేలా ఉండాలి.

❐ వాక్‌ఇన్ ఇంటర్వ్యూ అన్నంత మాత్రాన సంస్థలు నేరుగా ఇంటర్వ్యూకు పిలవకపోవచ్చు. రాత పరీక్షలు, గ్రూప్ డిస్కషన్‌లు నిర్వహించి, ఆ తరువాత ఇంటర్వ్యూకు పిలవొచ్చు. అందుకు ఆప్టిట్యూడ్, వెర్బల్, కమ్యూనికేషన్‌ల మీద పట్టు ఏర్పరచుకుని సిద్ధంగా ఉండాలి.

❐ మొత్తం మీద ప్రధానమైంది- ఇంటర్వ్యూ. ఇక్కడ చాలా అంశాలు దృష్టిలో ఉంచుకోవాలి. పోటీ ఎక్కువ ఉండటం వల్ల ఫస్ట్ ఇంప్రెషన్ చాలా ముఖ్యం. అభ్యర్థి కనపడే తీరు సరిగా లేకపోతే టీవీలో చానెల్‌ను మార్చినంత సులువుగా తరువాతి అభ్యర్థిని పిలుస్తారు. ఈ 'విజిబిలిటీ'...రూపమో, అందమో కాదు. ఆహ్లాదకరమైన ముఖకవళికలు, ఆత్మీయమైన పలకరింపు, మర్యాదపూర్వకమైన శరీర భాష.. ఇవన్నీ! ఆ తరువాత ఇంటరాక్షన్. ఇది అర్థవంతంగా, బలంగా, ఆశావహంగా ఉండాలి. మొత్తంగా ఇంటర్వ్యూ చేసే వ్యక్తికి ఎదుట ఉన్నది ఆత్మవిశ్వాసమున్న అభ్యర్థి అనిపించాలి.

ఈ లక్షణాలు అభ్యర్థిని నైపుణ్యాల మదింపు కోసం తరువాతి అంచెకు పంపడానికి పునాది. ఇక కంపెనీ ఆశిస్తున్న నైపుణ్యాలను ఒక్కోటీ వివరించగలగాలి. ఇక్కడ గుర్తుంచుకోవల్సిన విషయం ఏమిటంటే.. రెజ్యూమేలో ఉన్నది ఉన్నట్టుగా కాకుండా అభ్యర్థి ఇంకా అదనంగా వివరించగలగాలి. ఉదాహరణకు- విద్యా సంబంధ విషయాలన్నీ రెజ్యూమేలో రాస్తారు. కానీ దానిలో అభ్యర్థి ప్రత్యేకతను వెల్లడించేవాటిని మాత్రమే ప్రస్తావించాలి. అంటే.. తాను కళాశాల్లో ప్రథమ ర్యాంకు సాధించినట్లో.. లేదా మరొకటో. అలాగే నైపుణ్యాలు, పాల్గొన్నవి, సాధించిన విజయాలు, ఇంటర్న్‌షిప్‌లు, అనుభవంలోని ప్రత్యేకతలను ప్రస్తావించవచ్చు.

### ఏ విధంగా ఉపయోగకరం?

❐ జాబ్ ఫేర్‌ల ద్వారా వాక్‌ఇన్‌లు నిర్వహించినపుడు ఒకే వేదిక మీద ఒకేసారి వివిధ సంస్థల ఉద్యోగ ఎంపికల గురించి తెలుసుకునే అవకాశం ఉంటుంది. అప్పుడు అభ్యర్థులకు తగిన సంస్థ కానీ, జాబ్ ప్రొఫైల్ కానీ ఫలానా అని నిర్ధారణకు వచ్చి దరఖాస్తు చేసుకునే వీలుంటుంది. ఎందుకంటే జాబ్ ఫేర్‌ల ద్వారా నిర్వహించే వాక్‌ఇన్‌ల కన్నా ముందు చాలా సంస్థలు అక్కడికొచ్చినవారికి ప్రీ ప్లేస్‌మెంట్ టాక్‌ను నిర్వహిస్తాయి. అవి సంస్థ గురించి తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి. కంపెనీల ప్రతినిధులు అభ్యర్థుల ప్రశ్నలకు సమాధానాలు కూడా ఇస్తారు.

❐ వాక్‌ఇన్ ఇంటర్వ్యూలకు అర్హత ఉన్నవారెవరైనా పాల్గొనవచ్చు. కాబట్టి ఉద్యోగార్థులు ఇలాంటి ఓపెన్ కాంపిటిషన్‌ల ద్వారా మంచి స్థానాలకు ఎంపికయ్యే అవకాశముంటుంది.



### చేయకూడనివి

- రెజ్యూమేను సంస్థకు అవసరంలేని సమాచారంతో నింపకూడదు.
- కాజువల్ దుస్తుల్లో వెళ్లకూడదు.
- ఇంటరాక్షన్ సమయంలో మాట్లాడే అంశంపైనే దృష్టి ఉండాలి. ఎలా మాట్లాడుతున్నాననే ఆలోచన రానీయకూడదు.
- ఇంటర్వ్యూయర్ అడిగిన సమాచారం తెలియకపోయినా, అర్థం కాకపోయినా తెలిసినట్టు మాట్లాడి ఆకట్టుకోవాలనే ప్రయత్నం చేయకూడదు.
- ఇంటర్వ్యూలో అభ్యర్థి ప్రవర్తన అనాసక్తిగానో, నిర్లక్ష్యం ప్రదర్శితమయ్యేలానో ఉండకూడదు.
- ఇంటర్వ్యూ చేసేవారు మాట్లాడటం పూర్తవకముందే జోక్యం చేసుకోవడం, మొండిగా వాదనకు దిగడం లాంటివి చేయకూడదు.
- ఎట్టి పరిస్థితుల్లోనూ తనకు ఉద్యోగం అత్యవసరమనే భావనను వ్యక్తపరచకూడదు.
- చివర్లో 'ఏమైనా అడుగుతారా?' అన్నప్పుడు అత్యుత్సాహంతో అర్థంలేని ప్రశ్నలను వేయకూడదు.

### చేయాల్సినవి

- రెజ్యూమేను క్లుప్తంగా.. ఒకటి- రెండు పేజీల్లో తయారు చేసుకోవాలి.
- డ్రెస్ కోడ్ తప్పనిసరి. ఫార్మల్స్ ముఖ్యం.
- ఎవరితో మాట్లాడినా ఆత్మవిశ్వాసం ప్రదర్శించాలి. ముఖ్యంగా మాట్లాడే అంశంపై స్పష్టతతో ఉండాలి.
- ఇంటర్వ్యూకు ముందు ఆ సంస్థ గురించిన సమాచారాన్ని సేకరించాలి.
- కనీసం ఒక అర్ధగంట ముందైనా ప్రాంగణానికి చేరుకోవాలి.
- ఇంటర్వ్యూకు కావాల్సిన డాక్యుమెంట్లు అన్నింటినీ ఒక ఫోల్డర్‌లో క్రమ పద్ధతిలో అమర్చుకుని వెంట తీసుకెళ్లాలి.
- ప్రాంగణంలోకి వెళ్లినప్పటి నుంచి అయిపోయేంతవరకూ అవసరమైనపుడు మౌనంగా, సరైన నడవడికతో ఉండాలి.
- ఎదుటివారు చెప్పేది ఆసక్తిగా ఆలకించే తీరును కనబర్చాలి.



# ఈ సైన్స్ కోర్సుల్లో శాస్త్రవేత్తలే అధ్యాపకులు!

**మౌలిక సైన్స్ కోర్సులను ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో అభ్యసించటానికి వీలు కల్పించే ప్రవేశపరీక్ష... నెస్ట్. దీనిలో నెగ్గి, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు పూర్తిచేస్తే విద్యార్థుల భవిత ఉజ్వలంగా ఉంటుంది. ఇంతటి ప్రాముఖ్యమున్న ఈ జాతీయ స్థాయి నెస్ట్‌కు సమగ్రంగా ఎలా సిద్ధం కావాలో తెలుసుకుందాం!**

నేషనల్ ఎంట్రెన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (నెస్ట్)లో అర్హత సాధించినవారికి ప్రతిష్ఠాత్మకమైన నైసర్ (NISER) భువనేశ్వర్, ముంబయి యూనివర్సిటీ- ఎటామిక్ ఎనర్జీ డిపార్ట్‌మెంట్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బేసిక్‌సైన్స్ ముంబయి సంస్థల్లో ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీలో సీటు లభిస్తుంది. బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్ మొదలైన సబ్జెక్టుల్లో పీజీని ఇక్కడ సెమిస్టర్ విధానంలో అందిస్తున్నారు.




**ఎస్. కిరణ్‌కుమార్**
డైరెక్టర్, కెమ్‌బయోసిస్ కోచింగ్ సెంటర్


ఈ విద్యాసంస్థల్లో అత్యాధునిక రిసెర్చ్ ల్యాబ్స్, కంప్యుటేషనల్ సౌకర్యాలున్నాయి. ప్రముఖ శాస్త్రవేత్తలు బోధించటం ఇక్కడి విశేషం. ఈ పీజీలో అర్హత సాధించిన విద్యార్థులు ప్రభుత్వం అందించే నెలకు 5000 రూ॥ల ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్‌లకూ, ఏడాదికి 20వేల రూపాయిల సమ్మర్ ప్రాజెక్టుకూ అర్హులు. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు అధిక వేతనాలతో కూడిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వస్తాయి. ఇంకా బాబా ఎటామిక్ రిసెర్చ్ సెంటర్లో అడ్మిషన్ ఇంటర్వ్యూకు నేరుగా అర్హత లభిస్తుంది.



### ➤➤ దరఖాస్తు చేసేదెలా?

ఈ ప్రవేశ పరీక్షకు ఇంటర్‌మీడియట్/ 10+2ను 2016/ 2017లో పూర్తి చేసిన ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ విద్యార్థులూ, 2018 పరీక్షలు రాస్తున్న ఇదే గ్రూపుల విద్యార్థులూ అర్హులు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

నైసర్‌లోని 202 సీట్లలో జనరల్ కేటగిరిలో 101 సీట్లున్నాయి. సీబీఎస్‌లోని 47 సీట్లలో జనరల్ సీట్లు 23.

**నెస్ట్ దరఖాస్తు ముగింపు:** మార్చి 5, 2018

**పరీక్ష తేదీ:** జూన్ 2, 2018

### ➤➤ స్థాయి ఎక్కువే

ప్రవేశ పరీక్షల స్థాయి గణనీయంగా ఉంటుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్ స్థాయిలో ప్రశ్నలుంటాయి. ఇవి విద్యార్థుల విశ్లేషణ, తార్కిక సామర్థ్యాలను పరీక్షించేలా ఉంటాయి.

తెలుగు అకాడమీ, సి.బి.ఎస్.ఇ. ఎన్.సి.ఇ.ఆర్.టి. పుస్తకాలను చదివి, బేసిక్ కాన్సెప్టులు నేర్చుకోవాలి. ఆపై టాపిక్ వారీ రిఫరెన్స్ పుస్తకాల ద్వారా సబ్జెక్టును చదవాలి.

బయాలజీ విభాగంలో జనరల్ బయాలజీ, సెల్ బయాలజీ, జెనెటిక్స్, ఎకాలజీ అండ్ ఎవల్యూషన్, బయోటెక్నాలజీ, యానిమల్ ఫిజియాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, డీఎన్‌ఏ ధర్మాలు, ఆర్.డి.ఎన్.ఎ. టెక్నాలజీ, ట్రాన్స్‌లేషన్, ట్రాన్స్‌క్రిప్షన్ మొదలైనవాటి నుంచి అధిక ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి వీటిపై దృష్టి కేంద్రీకరించాలి.

ఆర్గానిక్ కెమిస్ట్రీలో జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, రియాక్షన్ మెకానిజం, స్టీరియో కెమిస్ట్రీ, నెమెడ్ రియాక్షన్స్, ఎరోమ్యాటిసిటి, కార్బోహైడ్రేట్స్, అమైనో యాసిడ్స్, పాలిమర్స్, ఫిజికల్ కెమిస్ట్రీలో మోల్ కాన్సెప్ట్, సొల్యూషన్స్, సాలిడ్‌స్టేట్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, కెమికల్ కైనటిక్స్, థర్మోడైనమిక్స్ సంబంధిత అంశాలను సమగ్రంగా చదవాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో సంశ్లిష్ట సమ్మేళనాలు, ఎస్, పి బ్లాక్ మూలకాలు, డి, ఎఫ్ బ్లాక్ మూలకాలు, మెటలర్జీ మొదలైనవి ముఖ్యం.

ఫిజిక్స్ విభాగంలో జనరల్ ఫిజిక్స్, ఆప్టిక్స్, మోడరన్ ఫిజిక్స్, ఎలక్ట్రిసిటీ, మ్యాగ్నటిజమ్, మెకానిక్స్ సంబంధిత సిలబస్‌ను అనువర్తిత ధోరణిలో అధ్యయనం చేయాలి.

మ్యాథమేటిక్స్‌లో కాల్‌క్యులస్, ట్రిగొనామెట్రీ, కోఆర్డినేట్ జామెట్రీ, ఆల్‌జీబ్రా, వెక్టర్స్ సంబంధిత సిలబస్‌ను సాధన చేయాలి. బట్టీ ధోరణిలో కాకుండా సబ్జెక్టును అవగాహన చేసుకొని విభిన్న అంశాలను అన్వయించగలిగితే నెస్ట్‌లో విజయం సాధ్యపడుతుంది. గత ప్రశ్నపత్రాలను www.nestexam.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

### పరీక్ష విధానం

ఆబ్జెక్టివ్ విధానంలో ఉండే నెస్ట్ ప్రశ్నపత్రంలో ప్రశ్నలు ఆంగ్లంలోనే ఇస్తారు. 5 సెక్షన్లలో ప్రతి సెక్షనుకూ దాదాపు 50 మార్కుల వెయిటేజ్ ఉంటుంది.

**సెక్షన్ –1:** అన్ని గ్రూపులవారూ తప్పనిసరిగా రాయవలసిన విభాగమిది. దీనిలోని ప్రశ్నలకు నెగిటివ్ మార్కులుండవు.

**సెక్షన్ –2 నుంచి సెక్షన్ –5:** బయాలజీ, కెమిస్ట్రీ మ్యాథ్స్, ఫిజిక్స్ ప్రశ్నల సెక్షన్లుంటాయి. విద్యార్థులు ఈ అన్ని ప్రశ్నలకూ సమాధానాలు రాయవచ్చు. కానీ సరిగ్గా సమాధానం రాసిన 3 సెక్షన్‌లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ఇంకా ఈ విభాగాల్లోని ప్రశ్నలకు నెగిటివ్ మార్కులుంటాయి.

ఈ ప్రవేశపరీక్ష రాయడానికి దాదాపుగా 3 గంటలు సమయం కేటాయిస్తారు.

## లైబ్రరీ

### నీట్ సమాచారం



1) క్రాష్ కోర్స్ ఇన్ బయాలజీ ఫర్ నీట్, రూ. 450
2) క్రాష్ కోర్స్ ఇన్ ఫిజిక్స్ ఫర్ నీట్, రూ. 475
3) క్రాష్ కోర్స్ ఇన్ కెమిస్ట్రీ ఫర్ నీట్, ధర: రూ. 475
4) ప్రాక్టీస్ నీట్ బయాలజీ, ధర: రూ. 250
5) ప్రాక్టీస్ నీట్ ఫిజిక్స్, ధర: రూ. 295
6) ప్రాక్టీస్ నీట్ కెమిస్ట్రీ, ధర: రూ. 250

ప్రచురణ: సెంగేజ్ లెర్నింగ్

### ఆంగ్ల మాధ్యమంలో!



1) టీఎస్‌పీఎస్సీ జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ (రెండు పుస్తకాలు), పేజీలు: 608+640, ధర: రూ. 699,

ప్రచురణ: విజేతకాంపిటీషన్స్

### ప్రభుత్వ పథకాలు



తెలంగాణ మరియు కేంద్ర ప్రభుత్వ పథకాలు, విధానాలు
పేజీలు: 128
ధర: రూ. 60
ప్రచురణ: విజ్‌డమ్ పబ్లికేషన్స్